సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 26 । మార్చి । 2025



మిడ్‌మానేరులో 10 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరులో నీటిమట్టం 10.58 టీఎంసీలకు చేరింది. మంగళవారం ప్రాజెక్టు నుంచి ఎల్ఎండీకి 2,500, కుడి కాలువకు 500, ఎడమ కాలువకు 5, భగీరథకు 45 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



పీహెచ్‌సీ తనిఖీ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్య కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించారు. ల్యాబ్, ఆరోగ్య మహిళ క్లినిక్‌ను సందర్శించారు.



	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.30	4.56
పెద్దపల్లి :	6.34	4.54
సిరిసిల్ల :	6.29	5.03
జగిత్యాల :	6.34	4.54

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

• ఎస్పీ మహేశ్ బీ.గీతే



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బీ.గీతే

కోనరావుపేట(వేములవాడ): సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ మహేశ్ బీ.గీతే అన్నారు. మంగళవారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, కేసుల వివరాలు పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదులపై జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా పెట్టి తనిఖీ చేయాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా తరచూ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతూ సైబర్ నేరాలు, బెట్టింగ్, గేమింగ్ యాప్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, ట్రెయినీ ఎస్సై రాహుల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడ: రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఎర్రబాపు ఇస్రాయల్‌ను ఈనెల 24న హైదరాబాద్‌లోని చంపాపేట్‌లో దస్తగిరి అనే వ్యక్తి దారుణంగా హత్య చేయడంపై మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమల్లోకి తీసుకువచ్చి రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, రేగుల దేవేందర్, పాత్తూరు అనిల్‌కుమార్, పిట్టల మనోహర్, పెంట రాజు, పురుషోత్తం, గోపికృష్ణ, ప్రతాప సంతోష్, గడ్డం సత్యనారాయణరెడ్డి, గోగికారి శ్రీనివాస్, గొంటి శంకర్, కటుకం జనార్దన్, రేగుల రాజకుమార్, గుజ్జె మనోహర్, పంపరి శంకర్, అనిల్, వడ్లకొండ శ్రీకాంత్, కనికరపు శ్రీనివాస్, హరీశ్, నాగేంద్రబాబు, పొత్తూరి మల్లేశ్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పయ్యావుల వైష్ణవి జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. ఈనెల 27 నుంచి బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా వైష్ణవిని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆది శ్రీనివాస్, పాట్రన్ కేకే మహేందర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ నర శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాన బాబు, మామిడి శ్రీనివాసు అభినందించారు.

ప్రత్యేక పథకాలు అందించాలి




నూతన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: తమ సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అందించాలని ఎరుకల ఏకలవ్య జిల్లా అధ్యక్షుడు కోనేటి సాయన్న కోరారు. మంగళవారం సంఘం ఎన్నికల అనంతరం కార్యవర్గంతో పాటు ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. 13 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమావేశానికి విచ్చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మొగిలి ధర్మరాజు, మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలిగా కుర్ర సావిత్రి, ఉపాధ్యక్షులు మానుపాటి పరశురాములు, అనుముల దేవయ్య, కార్యదర్శి సుల్తాన్ తిరుపతి, కార్యవర్గ సభ్యులు కోలేటి రమేశ్, సుల్తాన్, శేఖర్, మొగిలి నాగరాజు, కట్ట శంకర్, నిమ్మల కనకయ్య, నిమ్మ రాజయ్య, మొగిలి రాజశేఖర్, బిజిలి కనకరాజు, వానపాటి తిరుపతి, మొగిలి రవి, బండి యాదగిరి పాల్గొన్నారు.

‘మాయదారి’ రోగాలు!

• తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లతో ప్రమోషన్లు
• వారసులకు ఉద్యోగాలు
• జిల్లాలో అక్రమంగా నియామకాలు
• వరుసగా వెలుగుచూస్తున్న మోసాలు



సిరిసిల్ల: కొందరు ఉద్యోగులకు రిటైర్‌మెంట్‌కు ఆరేడేళ్ల ముందు మాయదారి రోగాలు వస్తున్నాయి. అప్పటి వరకు ఠంఛన్‌గా విధులకు హాజరైన వారు ఇక అక్కడి నుంచి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్తూ వివిధ రకాలు చికిత్సలు పొందుతున్నారు. కాదు..కాదు.. చికిత్స పొందినట్లు మెడికల్ సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారు. ఇదంతా ఎందుకు అనుకుంటున్నారా.. చదవండి మీకే తెలుస్తుంది. అనారోగ్యాన్ని సాకుగా చూపుతూ తాము పనిచేయలేమని తమ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇది జిల్లాలోని కొందరు ఉద్యోగులకు అంటుకున్న అసలు మాయదారి రోగం. ఇప్పటి వరకు ఇలా చాలా మంది ఉద్యోగులు వివిధ శాఖల్లో తమ వారసులను ప్రభుత్వ ఉద్యోగులుగా కూర్చోబెట్టారు. లేని రోగాలను తెచ్చుకుని, తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లను ‘కొని’తెచ్చుకున్న వైనాలు జిల్లాలో కొన్ని వెలుగులోకి రాగ.. అనేక సంఘటనలు ఇంకా మరుగునపడి ఉన్నాయి. జిల్లాలో సాగుతున్న అక్రమాలపై ప్రత్యేక కథనం.

ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసు(రిటైర్‌మెంట్ గడువు) ఇంకా ఆరు, ఏడు ఏళ్లు ఉందనగా.. దీర్ఘకాలిక సెలవులోకి వెళ్తారు. మెడికల్ లీవ్ పెడతారు. తరువాత కొన్ని నెలలపాటు అనారోగ్య సమస్యలు చూపుతూ వివిధ చికిత్సలు పొందినట్లు, ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయించుకుని, మందులు వాడినట్లు రికార్డులు సృష్టిస్తారు. ఆ మెడికల్ రిపోర్టులకు బలాన్నిచ్చేలా హైదరాబాద్‌లోని పెద్ద పెద్ద ఆస్పత్రులకు, ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలు పొందినట్లుగా మరిన్ని సర్టిఫికెట్లు సాధించుకుంటారు. వీటిని ఆసరా చేసుకుని, ఇక తాము ఉద్యోగం చేసేందుకు అనర్హులమని, అనారోగ్య సమస్యలతో విధులు చేయలేమని అర్జీ పెట్టుకుంటారు. మానవతా దృక్పథంతో తమ వారసులకు ఉద్యోగం ఇప్పించాలని వేడుకుంటారు. వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగుల వారసులకు మళ్లీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించే అధికారం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీకి ఉంటుంది. ఈ కమిటీలో ఆయా ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌వో, ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులతో కూడిన కమిటీ ఉంటుంది. ఈ కమిటీ పర్యవేక్షణలో అర్జీ పెట్టుకున్న ఉద్యోగి పనిచేయలేని స్థితిలో ఉన్నారా.. అనే అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అది నిజమే అయితే కమిటీ సిఫార్సు మేరకు కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సదరు ఉద్యోగి వారసులకు ఇస్తూ ఆదేశాలు జారీ చేస్తారు. ప్రభుత్వ జీవో ఆధారంగా అనేక మంది ఇలా వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించుకున్నారు.

‘సెస్’లో ఏం జరుగుతోంది..!?

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సేవలు అందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో ఉద్యోగులు తమ పిల్లలకు వారసత్వంగా ఉద్యోగాలను ఇప్పించే విధానం లేదు. ‘సెస్’లో పనిచేసే ఉద్యోగులకు మెరుగైన వేతనాలు ఉంటాయి. కానీ ఉద్యోగ విరమణ తరువాత పెన్షన్ ఉండదు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు ఉద్యోగులు ‘సెస్’ పాలకవర్గం అండదండలతో అక్రమ విధానంలో ఉద్యోగాలు పొందారు. ‘మాయదారి’ రోగాలను ‘కొని’తెచ్చుకుని ‘సెస్’ ఉన్నతాధికారులను, మెడికల్‌బోర్డు సభ్యులను డబ్బులతో కొనేసి తప్పుడు ధ్రువీకరణపత్రాలతో తండ్రి ఉద్యోగాన్ని వారసత్వంగా మెడికల్‌గ్రౌండ్స్(అనారోగ్య సమస్యలతో) సాధించుకున్నారు. ‘సెస్’లో వారసత్వ ఉద్యోగాలు సాధించుకున్న కొందరు నిజంగానే మెడికల్ అన్‌ఫిట్ కావడంతో ఉద్యోగాల్లో చేరగా.. అనేక మంది మాత్రం అన్నీ సవ్యంగా ఉన్నా.. అక్రమ పద్ధతుల్లో ‘సెస్’లో ఉద్యోగాలు సాధించి రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్నారు. జిల్లా పరిధిలోనే జీవితకాలం ఉద్యోగం కావడంతో కడుపులో చల్లకదలకుండా ‘సెస్’ పరిధిలో ఉద్యోగాలు చేస్తున్నారు. వచ్చే 11 ఏళ్లకు సరిపోయేంత మంది వారసులు వివిధ ఖాళీ పోస్టుల్లో ఉద్యోగులుగా చేరిపోయారు. ‘సెస్’ డైరెక్టర్లు, ఉన్నతాధికారుల అండదండలతో అక్రమమార్గంలో విధుల్లో చేరారు. ఏ విచారణ లేకుండా దర్జాగా డ్యూటీ చేస్తున్నారు.

ఇటీవల వెలుగుచూసిన ఘటనలు

• ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి పశువైద్యశాలలో పనిచేస్తున్న కొమురయ్య తాను పనిచేయలేని స్థితిలో ఉన్నానని తన కొడుకుకు ఉద్యోగం ఇప్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఏడు నెలల కిందట మెడికల్ ధ్రువీకరణపత్రాలతో అర్జీ పెట్టుకున్నాడు. దీనిపై జిల్లా స్థాయి కమిటీ పరిశీలించింది. అధికారుల పరిశీలనలో మెడికల్ సర్టిఫికెట్లు తప్పుగా ఉన్నట్లు అనుమానించారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేయించారు. కొమురయ్య సమర్పించిన వైద్యుల ధ్రువీకరణపత్రాల ఆధారంగా చేపట్టిన రహస్య విచారణలో ఆ సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులు, వారి మెడికల్ సర్టిఫికెట్లు, ఆస్పత్రి లోగో, ఐఎంఏలో వైద్యుల వివరాలు అన్నీ తప్పుడు పత్రాలుగా నిర్ధారణ అయింది. దీన్ని సీరియస్‌గా పరిగణించిన కలెక్టర్, కొమురయ్యపై పోలీసు కేసు నమోదు చేయించారు.

• ఇల్లంతకుంట మండలం గాలిపల్లి పశువైద్యశాలలో అటెండర్‌గా పనిచేసే కె.దేవమ్మ 2024 జూన్ 1న మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు తప్పుడు ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేయగా.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపించారు. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ జి.కిరణ్ ఏడీ, డీఎం(గ్యాస్ట్రో) డాక్టర్ రవికుమార్, పి.శరత్‌రెడ్డి వద్ద వైద్యపరీక్షలు చేయించుకున్నట్లుగా, హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లుగా తప్పుడు పత్రాలను సమర్పించినట్లు నిర్ధారణ అయింది. దీంతో దేవమ్మను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

తనిఖీలు లేకుండానే ఉద్యోగాలు..?

జిల్లాలో దశాబ్దకాలంగా ‘సెస్’తోపాటు, రెవెన్యూ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ ఇలా అన్ని ప్రభుత్వ శాఖల్లో మెడికల్ ఇన్‌వాలిడేషన్ గ్రౌండ్స్‌లో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి విచారణ లేకపోవడంతో ఏళ్లుగా ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. కొందరైతే నకిలీ విద్యార్హతల(బోగస్) సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది.. ప్రమోషన్లు పొందినట్లు సమాచారం. ఏది ఏమైనా ‘సెస్’ లాంటి సంస్థతోపాటు ప్రభుత్వ శాఖల్లో తండ్రి ఉద్యోగాన్ని పొందిన వారిపై విచారణ చేపడితే పశువైద్యశాఖ తరహాలో తప్పుడు ధ్రువీకరణపత్రాల భాగోతాలు బయటపడనున్నాయి.

దరఖాస్తులు వచ్చినా ఉద్యోగాలు ఇవ్వడం లేదు



మెడికల్ ఇన్‌వాలిడేషన్ గ్రౌండ్స్‌లో ఒకటి, రెండు దరఖాస్తులు వచ్చాయి. కానీ ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ఉద్యోగులు చనిపోయిన ఘటనల్లో ఐదు కారుణ్య నియామకాలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. మెడికల్ గ్రౌండ్స్‌లో గతంలో ఏం జరిగిందో మా పాలకవర్గానికి సంబంధం లేదు. ఇప్పుడైతే ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ఇవ్వం కూడా.

– చిక్కాల రామారావు, ‘సెస్’ చైర్మన్, సిరిసిల్ల

పరీక్షలు బాగా రాయాలి

• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడరూరల్: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం హన్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. వచ్చే సంవత్సరం అడ్మిషన్లు పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం లింగంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల బరువు, ఎత్తు వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. నాణ్యమైన పోష్టికాహారం అందజేయాలని సూచించారు.


టోకెన్ పద్ధతిలో కొనుగోళ్లు

సిరిసిల్ల: యాసంగి సీజన్‌లో వరికోతలపై హార్వెస్టర్ యజమానులతో తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి నియంత్రిత విధానంలో కోతలు జరిగేలా చూడాలని, టోకెన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రైతులంతా ఒకేసారి ధాన్యం తీసుకువచ్చి ఇబ్బంది పడకుండా జాగ్రత్త పడాలన్నారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. లారీల్లో మాత్రమే ధాన్యం తరలించాలని స్పష్టం చేశారు. కొనుగోళ్లపై ఫిర్యాదుల నమోదుకు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీఎస్‌వో వసంతలక్ష్మి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రజిత, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మార్కెటింగ్ శాఖ డీఎం ప్రకాష్, డీసీవో రామకృష్ణ, డీఏవో రామారావు, తూనికలు కొలతల అధికారి రూపేశ్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

జిల్లాలోని మధ్యమానేరు, అనంతగిరి జలాశయాల్లో ముంపునకు గురైన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ముంపు గ్రామాలైన గుర్రంవానిపల్లి, చీర్లవంచ, చింతలఠాణా, కొదురుపాక, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి, తదితర గ్రామాల నిర్వాసితులు ఏప్రిల్ 11లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సల్లంగచూడు పోచమ్మా..





వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి అమ్మవారికి బోనం, కల్లుసాక, ఒడి బియ్యం సమర్పించుకున్నారు.



ఎరుపెక్కిన నింగి.. నలుపెక్కిన చెట్లు

కళాకారుడి కుంచె నుంచి జాలువారిన బొమ్మలా... నింగి, సమీపంలో చెట్లు రంగు వేసుకున్నట్లుగా ప్రకృతి మనోహరమైన ఈ సుందర దృశ్యం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని వ్యవసాయ పొలాల వద్ద మంగళవారం సాయంత్రం కనిపించింది. గ్రామశివారును ఆనుకొని ఆకాశం..ఎత్తైనగుట్టల మధ్యవాలిపోతున్న సూరీడు ఎంతో ఆహ్లాదం పంచాడు. చూపరులను కనువిందు చేశాడు.

– ఇల్లంతకుంట(మానకొండూర్)

నూతన ఆవిష్కరణలతో ఉపాధి

• పరిశ్రమలశాఖ జీఎం హనుమంతు

సిరిసిల్ల: నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ వినియోగంతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, స్వయం ఉపాధి పథకాలు, ఉపాధి అవకాశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఐటీఐ, డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిరంగంలో రాణించాలన్నారు. మార్కెట్‌లో వస్తున్న నూతన టెక్నాలజీ, యంత్రాలు అప్‌డేట్‌పై ఎప్పటి కప్పుడు సమాచారం ఉండాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) అమలు చేస్తుందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయన్నారు. నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందని పేర్కొన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం హనుమంతు

సభ్యత్వ నమోదు గడువు పెంపు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం సభ్యత్వాల నమోదు గడువును పెంచినట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు. మంగళవారం సంఘ భవనంలో సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన పద్మశాలీ కులస్తులు అందరూ ఏప్రిల్ 5వ తేదీలోగా సభ్యత్వాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ఫిబ్రవరి 8న ప్రారంభమైన సభ్యత్వాల నమోదు మార్చి 26తో ముగియనుండగా గడువు పెంచినట్లు వివరించారు. ఈ సమావేశంలో మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న తండావాసులు

సిరిసిల్లటౌన్: తమ తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని బొంగులకింది తండా ప్రజలు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌కు తరలొచ్చి ధర్నా చేపట్టారు. గత బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను తమ తండాను ప్రత్యేక పంచాయతీగా చేయాలని కోరగా ప్రపోజల్ పంపినట్లు ప్రకటించారన్నారు. కానీ, అదే పార్టీలోని కొందరు తమ స్వార్థం కోసం రాజ్‌నాయక్ తండాతో పాటు తమ తండాను కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయడం జరిగిందని, అప్పటి నుంచి తాము రాజ్‌నాయక్ తండా జీపీలో ఉండటం లేదని పేర్కొన్నారు. కానీ, ప్రస్తుతం పంచాయతీ ఆఫీస్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారని, ఈ క్రమంలో తమ డిమాండ్‌ను గుర్తించి తమ తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని బి. శ్రీనివాస్, భాస్కర్ తదితరులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

రాములోరి కల్యాణం ఘనంగా జరిపించాలి

• ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు సీతారాముల కల్యాణోత్సవాలను గతంలోకంటే ఘనంగా జరిపించాలని, ఇందుకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. మంగళవారం చైర్మన్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీరామనవమి రోజు రాజన్న ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణానికి అశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి మాట్లాడుతూ, శ్రీరామనవమికి వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా, క్యూ లైన్‌లు, తాత్కాలిక మరుగుదొడ్లు, రవాణా, పారిశుద్ధ్యం, ఫైర్, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖను కోరారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు

అర్హులకు కేటాయించాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం శివారు శాంతినగర్‌లో కేసీఆర్‌నగర్ డబుల్‌బెడ్రూం ఇళ్లు శిథిలావస్థకు చేరకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. మంగళవారం కార్మిక భవనంలో మాట్లాడారు. శాంతినగర్‌లో 204 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ అర్హులకు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని పేర్కొన్నారు. వాటిని అర్హులైన దళితులకు వెంటనే అందించాలని కోరారు. మండేపల్లి కేసీఆర్‌నగర్‌లో అనర్హులకు కేటాయించిన డబుల్ బెడ్రూంలను గుర్తించి అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు కోడం రమణ, పద్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగిన అమ్మ గుండె.. తల్లడిల్లిన టెన్త్ విద్యార్థి


తల్లి శవయాత్రలో ఆమాన్


లత(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఓ వైపు పదో తరగతి పరీక్షలు.. మరోవైపు కన్నతల్లి హఠాన్మరణం చెందడంతో ఆ విద్యార్థి తల్లడిల్లిపోయాడు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన అమరం జనార్దన్‌రెడ్డి–లత దంపతుల కుమారుడు ఆమన్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. సోమవారం అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళ్లిన లత అక్కడే గుండెపోటుకు గురై మృతిచెందింది. పుట్టెడు దుఃఖంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించాడు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు షేక్ ఫిరోజ్‌పాషా, దేవయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం

సైదాపూర్: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఓ వృద్ధురాలిపై ఆదివారం రాత్రి ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు బాధితురాలు సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన యువకుడు కుటుంబంతో వృద్ధురాలి ఇంట్లో ఉంటూ గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. కొద్దిరోజుల క్రితం భార్యాపిల్లలు కరీంనగర్‌లోని ఇంటికి వెళ్లారు. కాగా ఆదివారం రాత్రి వృద్ధురాలిపై యువకుడు అత్యాచారం చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ ఫిర్యాదు


ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిల్లర మాటలతో కాలయాపన చేసి, పదవీకాలం వెల్ల దీస్తున్నాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ అన్నారు. కేసీఆర్‌ను దొంగనోట్లు ముద్రించాడని చేసిన ఆరోపణను ఖండిస్తూ బండి సంజయ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని టౌన్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ చిల్లర మాటలతో కరీంనగర్ ప్రతిష్టను దిగజారుస్తున్నాడని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కరీంనగర్ ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్‌ఎస్‌వీ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, గంగాధర చందు, రవిగౌడ్, ఒడ్నాల రాజు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో బాలుడి గల్లంతు

గొల్లపల్లి: మండలంలోని రంగధాముని‌పల్లి రిజర్వాయర్‌లో పడి నేరెల్ల నరేశ్ (12) గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నరేష్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఈత కోసం గ్రామ శివారులోని రిజర్వాయర్‌కు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై గజ ఈతగాళ్లతో గాలించారు. రాత్రి 8 గంటల వరకు గాలించినా ఆచూకీ లభించలేదు.

‘దళితబంధు’ విడుదల చేయండి

- రెండోవిడత నిలుపుదలపై హైకోర్టుకు లబ్ధిదారుడు
- వెంటనే నిధులు అందజేయాలని వినతి
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన బకాయిలు మొత్తం రూ.324 కోట్లు
- అందులో రూ.265 కోట్లు హుజూరాబాద్‌వే


పంపిణీకి సిద్ధంగా ఉన్న దళితబంధు వాహనాలు(ఫైల్)

సాక్షిప్రతినిధి,కరీంనగర్: దళితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం దళితబంధు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన ఈ పథకం ప్రభుత్వం మారడంతో నిలిచిపోయింది. పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుంచి తాజా ఆదేశాలు ఉన్నా.. జిల్లాస్థాయిలో అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు హైకోర్టు గడప తొక్కింది. తనకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని లబ్ధిదారుడు ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలో రెండో విడత బకాయిల విడుదలపై మరో సారి రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దాదాపు రూ.324 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఒక్క కరీంనగర్ జిల్లాలోనే రూ.265 కోట్ల వరకు బకాయిలు ఉండటం గమనార్హం.

అసలేం జరిగింది?

ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి వారిని, వాణిజ్యవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో 2021 ఆగస్టులో ఈ పథకాన్ని అప్పటి సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఇందులో దాదాపు 18,000 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వం రూ.2500 కోట్ల వరకు విడుదల చేసింది. వీరికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ.1800 కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, వివిధ యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. ఇందులో అనేక రకాల వ్యాపారాలు, వాహనాలు తదితర యూనిట్లు ఉన్నాయి. రెండో విడతలో దాదాపు 7000 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.265.62 కోట్లు రిలీజ్ అయ్యాయి. వీటిని ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది. ఈ డబ్బులను డ్రా చేయకుండా ప్రభుత్వం ఆపింది. ఇందులో లబ్ధిదారులకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు విడుదల కావాల్సి ఉంది. గతేడాది జూన్‌లోనే రెండో విడత బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అమలుకాకపోవడంతో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు.

హుజురాబాద్‌లోనే రూ.265 కోట్లు

ఆదిలాబాద్ రూ.68.08 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం రూ.69.48 లక్షలు, హన్మకొండ రూ.33.75 లక్షలు, హైదరాబాద్ రూ.10.20 లక్షలు, జగిత్యాల రూ.42.76లక్షలు, జనగామ రూ.21.84లక్షలు , జయశంకర్‌భూపాలపల్లి రూ. 12.10 లక్షలు, జోగుళాంబ గద్వాల రూ. 5.80, కామారెడ్డి రూ. 8.10 లక్షలు, ఖమ్మం రూ.2.41 కోట్లు, కొమురంభీమ్(ఆసిఫాబాద్) రూ. 48.59 లక్షలు, మహబూబాబాద్ రూ. 31.79 లక్షలు, మహబూబ్‌నగర్ రూ. 31.79 లక్షలు, మంచిర్యాల రూ.3.90 లక్షలు, మెదక్ రూ. 0.57 లక్షలు, మేడ్చల్–మల్కాజిగిరి రూ.40.46 లక్షలు నాగర్‌కర్నూల్ రూ.36.63 లక్షలు, నల్లగొండ రూ.25.77లక్షలు, నిజామాబాద్ రూ.4.92 లక్షలు, పెద్దపల్లి రూ.84.37లక్షలు, రాజన్నసిరిసిల్ల రూ. 79.00 లక్షలు రంగారెడ్డి రూ.7.99 లక్షలు సంగారెడ్డి రూ.44.63, సిద్దిపేట రూ. 55.80లక్షలు, సూర్యాపేట్ రూ.12.60లక్షలు, వికారాబాద్ రూ.66.46 లక్షలు, వనపర్తి రూ.14.90 లక్షలు, యాద్రాద్రి భువనగిరి రూ.1.18 కోట్లు కాగా మొత్తం రూ.11.93 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవి కాక, పైలెట్ ప్రాజెక్టుల కింద హుజూరాబాద్ ఏసీ(కరీంనగర్) రూ. 265.62 కోట్లు, హుజూరాబాద్ ఏసీ(హన్మకొండ) రూ. 15.57 కోట్లు, కామారెడ్డి(నిజాంసాగర్)1.20 కోట్లు, ఖమ్మం(చింతకాని) రూ.28.05 కోట్లు నాగర్‌కర్నూల్(చారగొండ) రూ.1.32 కోట్లు, సూర్యాపేట్(తిరుమలగిరి) రూ.90.61 లక్షలు, వాసాలమర్రి(యాద్రాద్రి) రూ.13.57లక్షలు కాగా.. మొత్తం రూ. 324.75 కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు విడుదల కావాల్సి ఉంది.

జపాన్- ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమానికి శుభశ్రీ


శుభశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి(కరీంనగర్): జపాన్ ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమంలో పాల్గొనేందుకు కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థిని శుభశ్రీ సాహు ఎంపికైనట్లు చైర్మన్ ఇ.ప్రసాదరావు తెలిపారు. జపాన్‌లో జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు జరగబోయే ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో 14 ఆసియా దేశాల నుంచి యువత పాల్గొంటుండగా.. శుభశ్రీకి చోటు లభించడం గర్వంగా ఉందన్నారు. సాకురా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అని పిలవబడే ఈ కార్యక్రమంలో రైతుల కోసం వినూత్నంగా తయారు చేసిన వ్యవసాయ యంత్రాన్ని ప్రదర్శించనుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అయ్యే ఖర్చులన్నింటిని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. అదేవిధంగా జాతీయ స్టార్టప్ దినోత్సవ వేడుకల సందర్భంగా భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లో నిర్వహించే ఉద్యోగ మహోత్సవ్–25లో పాల్గొనడానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు శుభశ్రీ, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహును కలెక్టర్ పమేలా సత్పతి తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

మరో తరానికి స్ఫూర్తినిచ్చిన మహాకవులు

- నలిమెల, జూకంటి సాహిత్య సదస్సులో వక్తలు


నలిమెల దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల/సిరిసిల్ల కల్చరల్: మరో తరానికి స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని అందించిన ప్రసిద్ధ కవులను ప్రేరణగా తీసుకుని ఉదీయమాన కవిత్వం వెలుగుచూడాలని ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ అన్నారు. జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కవులు డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్యంపై భాషా సాంస్కృతిక శాఖ, మానేరు రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, నిరంతర భాషాధ్యయనంతో తెలంగాణ పదకోశాన్ని రూపొందించిన భాస్కర్, ప్రపంచీకరణ నేపథ్యంలో ఉనికి కోల్పోతున్న జీవితాలపై దీర్ఘకాలంగా విశ్లేషణ చేశారని గుర్తు చేశారు. తెలంగాణ పదాలపై ఒకరు, పరిసరాలపై మరొకరు చేసిన పరిశోధనల కారణంగా స్ఫూర్తివంతమైన సాహిత్యం ఆవిర్భవించిందన్నారు. తొలిసదస్సులో నలిమెల భాస్కర్, జూకంటితో పాటు కవి, విమర్శకుడు అన్నవరం దేవేందర్, మల్లావఝుల నారాయణ శర్మ, టీవీ నారాయణ పాల్గొన్నారు. మానేరు రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పత్తిపాక మోహన్ కీలకోపన్యాసం చేశారు. అనంతరం డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథంలను నిర్వాహకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే యువ కవి దూడం గణేశ్ రచించిన మాయమైన మనిషి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ కటుకం శారద, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, మారసం ప్రతినిధులు ఎలగొండ రవి, వడ్డెపెల్లి సంధ్య, బూర దేవానందం, అంకారపు రవి, ఆడెపు లక్ష్మణ్, జి. శ్రీమతి, పాకాల శంకర్, కామారపు శ్రీనివాస్, మడూరి అనిత తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో ఒకరు.. అనారోగ్యంతో మరొకరు

- తంగళ్లపల్లి మండలంలో ఇద్దరి బలవన్మరణం


రాజు (ఫైల్)


విష్ణు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఇందిరమ్మకాలనికి చెందిన నేత కార్మికుడు పరికిపెల్లి రాజు (55)కు భార్య పద్మ, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిపించగా రూ.5 లక్షలమేర అప్పు అయ్యింది. కొద్దిరోజులుగా పవర్లూమ్స్ పని దొరక్కపోవడంతో మనస్తాపానికిగురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో గొడవపడిన రాజు మనస్తాపంతో బాత్రూమ్‌లు కడిగేందుకు ఉపయోగించే యాసిడ్ తాగాడు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన మొగిలోజి విష్ణు (45) వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.. రెండేళ్లక్రితం పక్షవాతం రావడంతో పనిచేయలేని పరిస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. అతడికి భార్య కవిత, కొడుకు, పుట్టుకతో అంధురాలైన కూతురు ఉన్నారు. మంగళవారం కవిత ఉపాధిహామీ పనికి వెళ్లగా ఇంటిలోని బాత్‌రూమ్‌లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవోదయ ఫలితాలు విడుదల

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి 80 సీట్లకు నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థుల హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచారు. నవోదయ వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. అనంతరం విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రిజర్వేషన్, కేటగిరీ పద్ధతిలో 14 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

కలప పట్టివేత


పట్టుబడిన కలపతో అధికారులు

చందుర్తి(వేములవాడ): రాజన్న సిరిసిల్ల–జగిత్యాల జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చందుర్తి– మోత్కులరావుపేట గ్రామాల మధ్య మంగళవారం వేకువజామున అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు అటవీశాఖ వేములవాడ డిప్యూటీ రేంజ్ అధికారి రాఘవేందర్‌రావు తెలిపారు. కలపను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. చందుర్తి, సనుగుల బీట్ అధికారులు బాలకృష్ణ, అనిత, బేస్‌క్యాంప్ సిబ్బంది తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



విద్యార్థుల నృత్యం

కొత్తపల్లి: ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన జోనల్‌స్థాయి స్మార్ట్‌కిడ్స్ జీకే ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయిలో పతకాలు సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన వి.ఆశ్రిత రెడ్డి (4వ తరగతి), సి.హెచ్.సోహన్, పి.మయాంక్ రెడ్డి (5వ), సాగి శ్రీదాత్రి, యు.రితేష్ (6వ), ఇ.లిఖిత్ కుమార్ (8వ), ఇ.రాజ్ ఆరుష్ పటేల్, కె.తనీష్ రెడ్డి, కె.రిషిక్ (10వ)లు జోనల్ స్థాయిలో మెడల్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు.

అలరించిన అల్ఫోర్స్ ‘బ్లూసూమ్’ వేడుకలు

కిసాన్‌నగర్‌లోని అల్ఫోర్స్ హైస్కూల్ వార్షిక వేడుకలు అలరించాయి. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అల్ఫోర్స్ బ్లూసూమ్ పేరిట నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్‌తో కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ క్రీడలు, పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

100గ్రాముల బంగారం, రూ.40వేల నగదు చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పాతబజార్‌లో వ్యాపారి దేవరకొండ కరుణాకర్‌కు చెందిన దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ ఘటనలో మొదటి అంతస్తులోని దుకాణం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు.. 100గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారని యజమాని కరుణాకర్ తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై మల్లేశ్ ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. భవనానికి మరమ్మతులు చేపట్టడంతో దుకాణాన్ని ఫస్ట్‌ఫ్లోర్‌లోకి మార్చారని, దొంగలు షటర్‌ను పగులగొట్టి లోనికి చొరబడి ఆభరణాలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

కారును ఢీకొన్న టిప్పర్.. పాస్టర్ దుర్మరణం


పాస్టర్ కరుణాకర్ (ఫైల్)


టిప్పర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

ఫెర్టిలైజర్‌సిటీ/ఎల్కతుర్తి: టిప్పర్.. కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్‌టీపీసీ జ్యోతినగర్‌కు చెందిన కనుకపుడి కరుణాకర్(58) రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని గ్లోరియస్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్. సోమవారం రాత్రి ఒంటి గంటకు కారులో ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని ధాయ్ విహార్ సమీపంలో ముల్కనూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పాస్టర్ కరుణాకర్ మృతికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సంతాపం తెలిపారు.

రైతులకు పరామర్శలే ప్రాప్తం

- అటకెక్కిన పంటల బీమా పథకాలు
- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం
- కొత్త ఇన్సూరెన్స్ పథకం కోసం రైతుల ఎదురుచూపు


ఇటీవల కురిసిన వర్షానికి జగిత్యాల రూరల్ మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: ఏటా రైతులు అయితే అధిక వర్షాలు.. లేకుంటే వడగండ్లు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే ధ్వంసమై.. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. అన్నదాతకు అండగా ఉంటామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కనీసం పంటల బీమా పథకాలైనా ఆదుకుంటాయని అనుకుంటే ఆ పథకాలు ఎప్పుడో అటకెక్కాయి. ఫలితంగా పంటలు నష్టపోయిన రైతులు తమ ఖర్మ అనుకుంటూ దేవుడిపై భారం వేస్తున్నారు.

పరిహారం ఇవ్వకుండా లేనిపోని నిబంధనలు

పంటలకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు పరిహారం అందించాలి. కానీ ప్రభుత్వాలు ఆ ప్రయత్నాలను ఎప్పుడో మర్చిపోయాయి. పైగా పరిహారం విషయంలో ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టింది. 33శాతానికి పైగా పంట నష్టం జరిగితేనే వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేసే పరిస్థితి నెలకొంది. కొన్ని అధికారులు నివేదిక పంపినా పరిహారం మాత్రం అందడం గగనంగానే మారింది. ఏటా అధిక వర్షాలతో వేలాది ఎకరాల పంట దెబ్బతిన్నప్పటికీ.. అధికారులు నివేదికలకే పరిమితమయ్యారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నయాపైసా వచ్చిన పాపాన పోలేదు. ప్రస్తుత యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న, నువ్వు, వరి పంటలు ఇటీవల వడగండ్ల వర్షాలకు నేలవాలి నష్టం వాటిల్లింది. అయినా ప్రభుత్వ నిబంధనల మేరకు పంట నష్టం జరగలేదని అధికారులు నివేదిక రూపొందించడంలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాత్రం హడావుడి చేసి రైతులను పరామర్శిస్తున్నారు తప్పితే పరిహారం ఇప్పించే దిశగా ఆలోచన చేయడం లేదు.

అటకెక్కిన బీమా పథకాలు

పంటలకు నష్టం జరిగితే పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రెండు పంటల బీమా పథకాలు అమలయ్యేవి. మొదటిది.. పంటల బీమా పథకం (ఫసల్ బీమా యోజన), రెండోది.. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం. ఈ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లిస్తుండగా.. మరి కొంత రైతులు చెల్లించేవారు. ఈ పథకాలను ప్రభుత్వాలు తీసుకొచ్చినా.. సరైన నిబంధనలు లేక రైతులకు బీమా అందడం లేదు. పంటల బీమా పథకంలో భాగంగా పంట రుణం తీసుకున్న రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్సు సంస్థలకు చెల్లించేవి. అయితే నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం చెల్లించడంలో ఇన్సూరెన్స్ సంస్థలు మీనమేషాలు లెక్కించాయి. రైతు యూనిట్‌గా కాకుండా.. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో ఏ ఒక్క రైతుకూ పంట నష్ట పరిహారం రాలేదు. పథకంలో పలు లోపాలున్నాయంటూ గత ప్రభుత్వం రద్దు చేసింది.

వాతావరణ ఆధారిత బీమా

అధిక ఉష్ణోగ్రతలు, వడగండ్లు, ఈదురుగాలుల వంటి వాతావరణ మార్పులతో మామిడి, మిర్చి, పత్తి వంటి పంటలు నష్టపోతే ఆయా పంటలకు పరిహారం వచ్చేలా ప్రభుత్వం వాతావరణ ఆధారిత పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో రైతులు చేరినా నష్టం జరిగినప్పుడు పలు నిబంధనలను సాకుగా చూపి ఇన్సూరెన్సు సంస్థలు పరిహారం ఇచ్చేందుకు వెనుకంజ వేశాయి. ఇందు కోసం మండలాల్లో ఏర్పాటు చేసిన వాతావరణ కేంద్రాలు ఇచ్చే సమాచారాన్ని ప్రమాణికంగా తీసుకున్నాయి. క్షేత్రస్థాయిలో పంట నష్టం జరిగితే వాతావరణ కేంద్రం నుంచి సరైన సమాచారం వెళ్లకపోవడంతో ఇన్సూరెన్సు సంస్థలు పరిహారం ఇచ్చేందుకు నిరాకరించాయి. దీనిపైనా రైతులు ఆందోళనలు చేశారు. అయినా ఇన్సూరెన్స్ సంస్థలు పట్టించుకోకపోవడంతో ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వం రద్దు చేసింది.

ఊరిస్తున్న పంటల బీమా పథకం

ఇప్పటివరకు ఉన్న బీమా పథకాలు రైతులకు న్యాయం చేయలేకపోయాయని, కొత్తగా ఆమోదయోగ్యమైన బీమా పథకాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. గ్రామం యూనిట్‌గా కాకుండా రైతును యూనిట్‌గా తీసుకుంటామని, ఏ పంటకు నష్టం జరిగినా ఇన్సూరెన్సు సంస్థ పరిహారం అందించేలా చూస్తామని చెబుతోంది. ఇన్సూరెన్సు సంస్థలకు ప్రీమియం కూడా చెల్లిస్తామని చెబుతున్నా.. ఎప్పుడు అమల్లోకి వస్తుందో తెలియడం లేదు. తాజాగా వడగండ్లతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి



ఇన్సూరెన్స్ పథకాలు అమల్లో లేకపోవడంతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. ఇది నాలాంటి రైతులందరి సమస్య. పంటలు సాగు చేసిన చాలామంది రైతులు పంటలు నష్టపోయి ఇబ్బంది పడుతున్నారు. – బందెల మల్లయ్య, చల్‌గల్, జగిత్యాల

ప్రభుత్వానికి నివేదిస్తాం



జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. రైతులకు ఆమోదయోగ్యమైన ఇన్సూరెన్స్ పథకాలు తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ విధానం అమల్లోకి వస్తే రైతులందరికీ న్యాయం జరుగుతుంది.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల

మీ సేవ.. మరింత చేరువ

- కొత్తగా తొమ్మిది రకాల సేవలు

కరీంనగర్ అర్బన్: మీసేవ సేవలు మరింత విస్తరించాయి. ప్రజలకు అన్ని రకాల సేవలందించేందుకు దశల వారీగా పలు అంశాలను చేర్చిన ప్రభుత్వం తాజాగా మరిన్ని సేవలను తీసుకొచ్చింది. 2011లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయగా దశల వారీగా నూతన సేవలను అందుబాటులోకి తెస్తూ రెవెన్యూ, రవాణా, పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్, విద్యుత్తు, ఎండోమెంట్, వ్యవసాయ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరా, విద్యాశాఖకు చెందిన ప్రస్తుతం సుమారు 300 రకాల పౌర సేవలు అందిస్తున్నారు. టీఎస్టీఎస్, టీఎస్ఆన్‌లైన్, ఇతర మీసేవ కేంద్రాలు మొత్తంగా జిల్లాలో 200లకు పైగా కేంద్రాలున్నాయి.

అదనంగా మరో 9రకాల సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరో 9 రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతో పాటు అటవీశాఖకు సంబంధించిన నూతన ఐచ్ఛికాలను అందుబాటులోకి తెచ్చింది. రెండు విద్యా కోర్సుల మధ్య గ్యాప్ పీరియడ్ ధ్రువీకరించడానికి గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల పేరు మార్పిడి, పౌరుల స్థానికతను నిర్ధారించేలా లోకల్ క్యాండిడేట్(స్థానిక అభ్యర్థి) సర్టిఫికెట్, మైనార్టీలకు మైనార్టీ పథకాలు, ఉపకార వేతనాలు, రిజర్వేషన్ వంటి అంశాలను ధ్రువీకరించేలా మైనార్టీ సర్టిఫికెట్, కులం, ఆదాయ ధ్రువపత్రాల పునః జారీ(రీ ఇష్యూ), వెనుకబడిన తరగతులకు చెందిన వారికి క్రీమీలేయర్– నాన్ క్రీమీలేయర్ ధ్రువపత్రం, వయో వృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవేక్షణ వ్యవస్థ వంటి సేవలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నాయి. వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, కలప(టింబర్) డిపోలు, సామిల్ అనుమతులు, రెన్యూవల్, నిర్వహణ వంటి అటవీ శాఖ సేవలు నూతనంగా మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి. అధికారులు మీసేవ సర్వర్ సమస్యలు పరిష్కరించడంతో పాటు మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లకు నూతన సర్వీసులకు సంబంధించి అవగాహన, శిక్షణ కల్పించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలందనున్నాయి.

పట్ట గొలుసులు చోరీ

హుజూరాబాద్: పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో పట్టగొలుసు చోరీ చేయగా ఇద్దరు మహిళలను సీసీ కెమెరాలు ఆధారంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు పట్ట గొలుసులు కావాలని షాపులోకి వచ్చారు. వాటిని యజమాని చూపిస్తుండగా దాచిపెట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన షాపు యజమాని పోలీసులకు అప్పగించారు.